## క్లుప్తంగా

### బాలరాముని శోభాయాత్ర



కాషాయజెండాతో యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని బజారువీధిలో బాలరాముని శోభాయాత్ర మంగళవారం వైభవంగా నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని, రామభక్తులు ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులంతా కాషాయ జెండాలు, రాముని చిత్రపటాలు చేతపట్టి, వీధుల్లో తిరిగారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఈ యాత్రలో పాల్గొని, శ్రీరాముని పట్ల భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

### నేటి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు



పోటీలకు సిద్ధం చేస్తున్న కోర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.వి. నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన మైదానంలోని కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు సహా క్రికెట్ గ్రౌండ్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ నెల 24, 25వ తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. ఆయన వెంట ఆర్ఐ చక్రవర్తి, పీడీలు రేణుకాదేవి, కేశవనారాయణ తదితరులు ఉన్నారు.

### ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం

బొబ్బిలి: స్థానిక సబ్‌జైలులో ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభించినట్లు జైలు సూపరింటెండెంట్ జీఎస్ఆర్ పాత్రో మంగళవారం తెలిపారు. రిమాండ్ ఖైదీల్లో మానసిక పరివర్తనే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశామన్నారు. నెలకు రెండుసార్లు చొప్పున పాటలు, గేయాల ద్వారా జీవితం విలువను తెలియజేయాలని స్థానిక ఆనందో బ్రహ్మ బృందాన్ని కోరామన్నారు. ఈ మేరకు ఆనందో బ్రహ్మ అధ్యక్షుడు మింది విజయమోహనరావు మాట్లాడుతూ ఖైదీల్లో పరివర్తనకు చర్యలు తీసుకుంటామన్నారు.

### జాతీయ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బొబ్బిలి: జాతీయ స్థాయి క్యాట్ ఒలింపియాడ్ పోటీల్లో స్థానిక పట్టణంలోని చైతన్య స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ కె.మురళీధర్ మంగళవారం తెలిపారు. 26 మంది నగదు బహుమతులు, 75 మంది బంగారు పతకాలు, మరో 189 మంది మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని పేర్కొన్నారు.

### పోక్సో కేసు నమోదు

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామంలోని ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆంధ్ర పోలీసులు మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు బాధిత బాలిక బంధువులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ విచారణ చేపట్టిన అనంతరం కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

### మండల స్థాయి పోటీల విజేతలు వీరే..



ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల విజేతలను అధికారులు మంగళవారం సాయంత్రం ప్రకటించారు. బాలుర విభాగంలో క్రికెట్ పోటీల్లో ఇందిరమ్మ కాలనీ జట్టు, వాలీబాల్‌లో పక్కి–2 జట్టు, కబడ్డీలో మెట్టవలస జట్టు, షటిల్ బ్యాడ్మింటన్‌లో మల్లంపేట జట్టు, ఖోఖోలో పారాది జట్టు విజయం సాధించగా, బాలికల విభాగంలో వాలీబాల్ పోటీల్లో గోపాలరాయుడిపేట జట్టు, కబడ్డీలో మెట్టవలస జట్టు, షటిల్‌బ్యాడ్మింటన్‌లో ఇందిరమ్మ కాలనీ జట్టు, క్రికెట్‌లో గొల్లపల్లి జంక్షన్ జట్టు, ఖోఖోలో పూల్‌భాగ్ జట్టు గెలుపొందాయి. క్రికెట్‌లో ఇందిరమ్మ కాలనీ జట్టును లీడ్ చేసిన శివ తదితరులను వైఎస్సార్ సీపీ నేత చంద్రపూడి రమేష్ సత్కరించి, రూ.5 వేల నగదు పురస్కారం అందజేశారు.

**నియోజకవర్గ స్థాయి పోటీలు..**

పట్టణ పరిధిలోని గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం అక్కడి మైదానాన్ని, పోటీల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించి, స్నేహపూరిత వాతావరణంలో పోటీలు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

# నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

వాడవాడలా సుభాష్‌చంద్రబోస్ 127వ జయంతి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులంతా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ స్వాతంత్ర్యానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వమత సామరస్యంతో కూడిన దేశ సమైక్యతను ఆయన బలంగా కోరుకున్నారని, ఆ దిశగా మనమంతా కృషి చేయాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే ఇటువంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులకు తెలిపి, దేశభక్తిని పెంపొందించాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి



రాజాం సిటీ: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం



సంతకవిటి: బొద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేతాజీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తెర్లాం గ్రంథాలయంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



రేగిడి: కందిశలో జరిగిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో..

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

• డీఎంహెచ్‌వో భాస్కరరావు



మెంటాడ: కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు



తెర్లాం: రోగులకు మందుల కిట్ అందజేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

మెంటాడ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌వో భాస్కరరావు అన్నారు. మండలంలోని ఆగూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించిన ఆయన శిబిరానికి వచ్చే ప్రతీ రోగికి ఆరోగ్య తనిఖీలు చేసి, మందులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం శిబిరంలో పలువురికి నేత్ర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు లోకప్రియా, సీహెచ్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని విజయరాంపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి వైద్యారోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సేవలను పరిశీలించిన ఎంపీడీవో రామకృష్ణ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మధుసూదనరావు, సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## 10 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, తాటిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా ఎప్పుడైనా అక్రమంగా మద్యం అమ్మినా, తయారు చేసినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే సమయంలో మిల్లర్లు చేతివాటం చూపిస్తున్నారని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన ఇకమీదట ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యం

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



ఎంపీపీ లక్ష్మణరావుతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి, ఈవోపీఆర్డీ వెంకటరమణ

రామభద్రపురం: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎంపీడీవో రమామణి, ఈవోపీఆర్డీ వెంకటరమణలు ఎంపీపీతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మండలంలోని 22 పంచాయతీలకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.కోటి విడుదలైన విషయాన్ని ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నిధులతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక ప్రకారం చేయాలన్నారు. అన్ టైడ్ కింద రూ.39.97 లక్షలు, టైడ్ కింద రూ.60.50 లక్షలు విడుదలయ్యాయన్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల వడ్డీతో సహా ఇప్పుడు విడుదల చేసిందన్నారు. టైడ్ కింద విడుదలైన నిధులను పారిశుద్ధ్యం, క్లాప్ మిత్రలకు వేతనాలు, తాగునీరు, కొత్త పైపులైన్లు లేదా మరమ్మతుల కోసం వినియోగించాలని సూచించారు. అన్‌టైడ్ నిధులు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం పంచాయతీలో అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలన్నారు. ఈ నిధులు పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు.

### వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి లెంక ప్రదీప్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందువదన, హెల్త్ అసిస్టెంట్ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## • కులగణనతో సామాజిక సమతుల్యత

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో కులగణన పక్కాగా జరుగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మంగళవారం ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేర సర్వే చేసి, వివరాలు సేకరించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే ద్వారా ఆర్థికంగా వెనకబడిన వారికి సంక్షేమ పథకాలు అందజేసి, తద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపడం, సామాజిక సమతుల్యత సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్



రేగిడి: కందిశలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



రాజాం సిటీ: లక్ష్మీపురంలో కులగణన



వంగర: మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి, కులగణన సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

# 'వైఎస్సార్ ఆసరా'తో మహిళల్లో ఆనందం



బొబ్బిలి: ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం తిలకిస్తున్న ఎంపీపీ లక్ష్మీ వేణుగోపాలనాయుడు తదితరులు



సంతకవిటి: ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న లబ్ధిదారులు

వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధుల విడుదలతో స్వయం సహాయ సంఘాల మహిళల్లో ఆనందం నెలకొంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని మండల పరిషత్ కార్యాలయాలు, సచివాలయాల్లో లబ్ధిదారులు మంగళవారం వీక్షించారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేరుస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. శాశ్వత ఉపాధి కలిగేలా ఈ నగదును వినియోగించుకుంటామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

## ఎమ్మెల్యేగా గెలిపించండి

• వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



తలే రాజేష్‌ను సత్కరిస్తున్న కొండంపేట గ్రామస్తులు

రాజాం: ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. స్థానిక పట్టణ పరిధిలోని కొండంపేటకు మంగళవారం వెళ్లిన ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, పలు సంఘాల ప్రతినిధులను కలిసి, రానున్న ఎన్నికల్లో తనకు, వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చి, ఆశీర్వదించాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందన్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ప్రతీ వర్గానికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలు, నిర్ణయాలు దేశానికే ఆదర్శమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మరోసారి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో వారంతా వైఎస్సార్ సీపీకే తమ పూర్తి మద్దతు అని, రానున్న ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాజేష్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నేతలు ముద్దాన సత్యారావు, సలాది తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి సభను విజయవంతం చేయాలి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: విశాఖ జిల్లాలోని భీమిలిలో ఈ నెల 27వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల ప్రచారానికి ఈ సభ ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారన్నారు. సభకు మండలం నుంచి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీ పదవులు అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలంతా అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఇదే సభలో రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సీఎం జగనన్న దిశానిర్దేశం చేయనున్నారన్నారు. మండలంలోని పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి, పార్టీ గతంలో కన్నా అత్యధిక మెజార్టీతో గెలుపునివ్వాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమా లక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



రేగిడి: వన్నలిలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



బాడంగిలో కేక్ కట్ చేసి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న అంగన్‌వాడీలు

రేగిడి: మండలంలోని మొత్తం 84 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూకాలమ్మ మంగళవారం తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా 42 రోజుల పాటు సమ్మె బాటపట్టిన వారు ప్రభుత్వంతో సుదీర్ఘ చర్చలు తర్వాత ఎట్టకేలకు ఉద్యోగాల్లో చేరారన్నారు.

రాజాం: స్థానిక పట్టణంతో పాటు మండలంలోని 101 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరినట్లు రాజాం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ మంగళవారం తెలిపారు.

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు..**

బాడంగి: మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, ఆయాలు మంగళవారం విధుల్లో చేరి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ న్యాయమైన 11 డిమాండ్లలో 10 డిమాండ్లను పరిష్కరించేందుకు సర్కారు అంగీకరించిందని, దీంతో చాలా ఆనందంగా ఉందన్నారు. సమ్మెకాలపు జీతం చెల్లింపు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తింపు, అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు గ్రాట్యుటీ పెంపు, ఇదే గ్రాట్యుటీ ఆయాలకు రూ.20 వేల నుంచి రూ.60 వేలకు పెంపు, మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు, సహజ మరణానికి రూ.2 లక్షల బీమా, ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు, గ్యాస్, మెనూ చార్జీల పెంపు, నెలవారీ టీఏల బిల్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు సీఐటీయూ జిల్లా నేతలు ఎ.సురేష్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మండల స్థాయి పోటీలు



క్రీడాసామగ్రి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండల కేంద్రంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు క్రీడాకారులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీర ఆరోగ్యం లభించడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.